# కేంద్ర అధికారుల బృందం పర్యటన


వెంకట్రావుపల్లెలో ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట/గీసుగొండ, మే 28: భారత ప్రభుత్వం, మాల్దీవ్స్ రిపబ్లిక్ మధ్య నింబధన (ఎంవోయూ)లో భాగంగా మాల్దీవ్ స్థానిక పరిపాలనా మండలి ప్రతినిధులు బుధవారం మండలంలో పర్యటించారు. ఉదయం వర్ధన్నపేట మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన అధికారులకు బతుకమ్మలతో సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు కార్యాలయంలో మండలంలో జరుగుతున్న పనులు, ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని వెంకట్రావుపల్లెను సందర్శించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 23 మందికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయగా నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఎంపీడీవో వెంకటరమణ ద్వారా మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో ధనలక్ష్మి, ఏపీవో నాగేశ్వర్ పాల్గొన్నారు. గీసుగొండ మండలంలోని స్వయం సహాయక సంఘాల పనితీరును మాల్దీవ్స్ నుంచి వచ్చి అధ్యయన ప్రతినిధుల బృందం తెలుసుకుంది. మండల సమాఖ్య కార్యాలయానికి చేరుకున్న ప్రతినిధులు సంఘం కార్యకలాపాల నిర్వహణ, వడ్డీలేని రుణాలు, బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసుకున్న కుటీర పరిశ్రమల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

## నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో చర్యలు చేపట్టాలి

కరీమాబాద్, మే 28: తేలికపాటి వర్షాలకే డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయని, అధికారులు లోతట్టు ప్రాంతాలపై చర్యలు చేపట్టాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి బల్దియా అధికారులను కోరారు. బుధవారం ఆయన ఎంహెచ్‌వో రాజేశ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. డీకేనగర్, ఉప్పరోనికుంట, ఉర్సు ప్రతాప్‌నగర్‌పై దృష్టి సారించాలని కోరారు.

# దిగుమతిలో జాప్యం జరగకుండా చర్యలు

- ధాన్యం తడవకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- బాయిల్డ్ మిల్లులకు పంపిస్తే బోనస్ రాదు
- కలెక్టర్ సత్యశారద
- గోడు వెల్లబోసుకున్న అన్నదాతలు


ఖానాపురం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద

ఖానాపురం, మే 28: నర్సంపేట నియోజకవర్గంలో ధాన్యం దిగుమతిలో జాప్యం జరగకుండా చర్యలు చేపడతామని కలెక్టర్ సత్యశారద రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఆమె మండలంలోని ఖానాపురం, పెద్దమ్మగడ్డ, మనుబోతులగడ్డలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి రెండు నెలలు కావొస్తున్నా కొనుగోలు చేయడం లేదని బండమీదిమామిడితండా రైతులు కలెక్టర్ ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. వర్షాల కారణంగా తేమశాతం 25 నుంచి 40 వరకు వస్తున్నదని, ఎంతకాలం ధాన్యాన్ని ఆరబెట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు. తేమశాతం తగ్గని ధాన్యాన్ని అదనంగా మరో కిలో కోతతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వర్ష సూచనల నేపథ్యంలో ఆరబెట్టిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో 30,531 మంది రైతుల నుంచి 1,48,275 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో మరో 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉందన్నారు. నియోజకవర్గంలో మిల్లర్లకు కేటాయించిన ధాన్యం టార్గెట్ పూర్తయినందున జాప్యం జరుగుతున్నదని, ఇతర ప్రాంతాల మిల్లర్లతో మాట్లాడి దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. సన్నరకం ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు పంపిస్తే బోనస్ రాదన్నారు. కార్యక్రమంలో డీసీవో నీరజ, డీఎం సంధ్యారాణి, డీఎస్‌వో కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ హరిబాబు, డీటీ సంధ్యారాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ, ఏవో శ్రీనివాస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

### రైతులు అధైర్య పడొద్దు

పర్వతగిరి: రైతులు అధైర్య పడొద్దని, అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టి తక్షణమే తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. పర్వతగిరి మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించి రైతులతో మాట్లాడారు. ధాన్యం సేకరణ, రవాణా తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం తక్కువగా ఉన్న ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచించారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని రైతులు కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యాదేవి, జిల్లా సహకార అధికారి నీరజ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ఐకేపీ ఏపీఎం కృష్ణమూర్తి, ఆర్ఐ మధుసూదన్ పాల్గొన్నారు.

## జాన్‌పీరీలు వద్ద ఆర్వోబీ ఏర్పాటుపై సమీక్ష

ఖిలావరంగల్, మే 28: వరంగల్ రైల్వేస్టేషన్ జాన్‌పీరీలు రైల్వేగేటు సమీపంలో ఆర్వోబీ ఏర్పాటుపై కలెక్టర్ సత్యశారద బుధవారం సమీక్షించారు. ప్రస్తుతం జాన్‌పీరీలు రైల్వేగేటు వద్ద జరుగుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు 130 మీటర్ల దూరంలో నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తున్నదని, ఈ ప్రాంతంలో ఆర్వోబీ నిర్మిస్తే వాహనాలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. కుడా, ఆర్‌అండ్‌బీ, రైల్వే ఇంజినీర్లతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి, నివేదిక అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ దేవిక, రైల్వే ఈఎస్ సుభాష్‌రెడ్డి, సూరింటెండెంట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

## వసంతపురం ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఖిలావరంగల్/సంగెం, మే 28: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ వసంతపురంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సమయపాలన పాటించని సిబ్బందిని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కొమురయ్య, డాక్టర్ మోహన్‌సింగ్ పాల్గొన్నారు. అలాగే, సంగెం మండలంలోని కాపులకనపర్తి ఆరోగ్య ఉపకేంద్రాన్ని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. మండలంలోని పిల్లలకు టీకాలను సకాలంలో వేయాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలోని మందులు, టీకాలు, ఉద్యోగుల పనితీరు, రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాశ్, మండల వైద్యాధికారి దేవేందర్ పాల్గొన్నారు.


విత్తనాలను తనిఖీలు చేస్తున్న అధికారులు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

సంగెం, మే 28: ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సీహెచ్ యాకయ్య హెచ్చరించారు. మండలకేంద్రంతోపాటు గ్రామాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను బుధవారం వ్యవసాయ, జిల్లా టాస్క్‌ఫోర్స్, పోలీస్ శాఖ అధికారులు తనిఖీ చేశారు. విత్తనాల నాణ్యత, స్టాక్, సేల్ రిజిస్టర్లు, బిల్ బుక్‌ల నిర్వహణ, ఇన్‌వాయిస్‌లు, నిల్వ, ధరల పట్టికలను పరిశీలించారు. లోహిత గ్రామంలోని శ్రీసాయి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణంలో రికార్డుల నిర్వహణ సరిగా లేనందున దుకాణంలోని 492 పత్తి విత్తనాల ప్యాకెట్లు (రూ. 4,43,292), 30 మక్కజొన్న విత్తనాల ప్యాకెట్లు (రూ.57 వేలు), ఆజాజ్ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణంలో 210 పత్తి విత్తనాల ప్యాకెట్లు (రూ. 1,89,210) విక్రయించకుండా ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో ఏవోలు ప్రశాంత్, గోవర్ధన్‌రెడ్డి, లలిత, ఎస్సై అర్చన, సిబ్బంది చందర్ పాల్గొన్నారు.

### క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలి

రాయపర్తి, మే 28: క్రీడా శిక్షణ శిబిరాలను వినియోగించుకోవడం వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని జిల్లా యువజన సర్వీసుల అధికారి సత్యవాణి అన్నారు. తిర్మలాయపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. గ్రామీణ యువతలో నైపుణ్యాలకు కొదవలేదన్నారు.

### 'పరుపాటి' ఆర్థిక చేయూత

రాయపర్తి, మే 28: బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో బుధవారం పలువురికి తన ప్రతినిధుల ద్వారా ఆర్థిక సాయం అందించారు. మండలంలోని ఆరెగూడెంలో నిర్మితమైన ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాల కోసం ఉత్సవ కమిటీకి రూ. 21 వేల నగదు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు భారతరత్న పురస్కారం అందుకుని తొలిసారిగా వరంగల్‌కు వస్తున్న నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు వెళ్తున్న ఎమ్మార్పీఎస్ మండల ప్రతినిధులకు రూ. 40 వేల నగదు, కొండూరులో అనారోగ్యంతో మృతి చెందిన రామారపు రాములు కుటుంబ సభ్యులకు రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

### పంట మార్పిడి లాభదాయకం : ఎమ్మెల్యే రేవూరి

గీసుగొండ, మే 28: రైతులు పంట మార్పిడి విధానం పాటిస్తే లాభదాయకంగా ఉంటుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించాలని, అప్పుడే భూమిలో సారం పెరుగుతుందన్నారు. రైతులు భూసార పరీక్షలు చేసుకొని పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఏడీఆర్ డాక్టర్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఏవో హరిప్రసాద్, ఏఈవో అఖిల, రైతులు పాల్గొన్నారు.

### 'ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి'

ఖిలావరంగల్, మే 28: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపి వేయాలని ఎంసీపీఐ పొలిట్‌బ్యూరో సభ్యుడు మద్దె వెంకటరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శివనగర్‌లో మూడు రోజులుగా జరుగుతున్న ఎంసీపీఐ రాష్ట్ర ప్రథమ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై రాజ్యహింసను కొనసాగిస్తున్నదని ఆరోపించారు. నక్సలైట్ల ఏరివేతను చేపట్టినామని చెబుతూ పోరులను పిట్టలను కాల్చినట్లు చంపి కనీసం శవాలను కూడా వారి కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు.

### రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి

వరంగల్‌చౌరస్తా, మే 28: రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే అందుబాటులో ఉండేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య కోరారు. వరంగల్ స్టేషన్‌రోడ్డులో విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని, భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని సూచించారు. అనుమతి ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనాలన్నారు.

### ఎంపీవోగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

గీసుగొండ, మే 28: ఎంపీవోగా పాక శ్రీనివాసులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆడెపు ప్రభాకర్ ఉద్యోగ విరమణ పొందారు. రాయపర్తి నుంచి శ్రీనివాసులు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి పాల్గొన్నారు.

## ఒకరి అదృశ్యం

కరీమాబాద్, మే 28: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ ప్రాంతానికి చెందిన గోల్కొండ ప్రసాద్ హైదరాబాద్‌లో పని చేస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం ఇంటికి వచ్చి ఏప్రిల్ 17న హైదరాబాద్‌కు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. నాటి నుంచి ఫోన్ చేయగా సమాధానం లేదు. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.


వైన్ షాపులో గుర్తించిన దొంగనోట్లు

## వైన్ షాపులో దొంగనోట్ల కలకలం

పర్వతగిరి, మే 28: మండలకేంద్రంలోని దుర్గాశ్రీ వైన్ షాపులో దొంగనోట్లు కలకలం రేపాయి. వైన్ షాప్ సిబ్బంది కథనం ప్రకారం.. వైన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం కొనుగోలు చేశారు. కలెక్షన్ డబ్బులను బుధవారం బ్యాంకులో డిపాజిట్ చేయడానికి నిర్వాహకులు వెళ్లారు. అందులో రెండు 100, ఒకటి 500 దొంగ నోట్లుగా బ్యాంకు సిబ్బంది గుర్తించారు. తెలిసిన వారే మద్యం కొనుగోలు చేసి, దొంగ నోట్లు చలామణి చేశారా లేదా గుర్తుతెలియని వ్యక్తుల పనేనా లేదా దొంగ నోట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయం తేలాల్సి ఉంది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వైన్‌షాపు నిర్వాహకులు తెలిపారు.

## మహిళలను కోటీశ్వరులు చేయడమే ధ్యేయం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- పలు అభివృద్ధి పనులు ప్రారంభం


మండల సమాఖ్యకు చెక్కు అందజేస్తున్న దొంతి మాధవరెడ్డి

నెక్కొండ/చెన్నారావుపేట, మే 28: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ ధ్యేయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో భారతి మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య అధ్యక్షతన బుధవారం వార్షిక మహాసభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 115 ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ. 15.10 కోట్ల విలువైన చెక్కును అందించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, జిల్లా అడిషనల్ డీఆర్‌డీవో రేణుకాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, మండల సమాఖ్య ఓబీ నాగరాణి, పద్మ, సునీత, సీసీలు రవీందర్, ఏకాంబ్రం, శారద, వెంకట్, ఎస్‌ఎన్ లావణ్య పాల్గొన్నారు. అలాగే, మండలంలోని నాగారం-ఇంటికన్నె మధ్యలో వట్టివాగుపై చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మాణ పనులు, చిన్నకొర్పోలు-పెద్దకొర్పోలు వట్టివాగుపై చెక్‌డ్యామ్, బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే దొంతి ప్రారంభించారు. అంతేకాకుండా చెన్నారావుపేట మండలకేంద్రంలోని రైతు వేదికలో జరిగిన మహిళా సమాఖ్య మహాజన సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. త్వరలోనే మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీవో శ్రీవాణి, బ్యాంక్ మేనేజర్ మెహన్‌కాంత్, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ జిమ్మిక్కులు చేస్తున్న కాంగ్రెస్

- గత ప్రభుత్వ పనులనే ప్రారంభిస్తూ షో చేస్తున్న ఎమ్మెల్యే దొంతి
- బీఆర్‌ఎస్ నాయకుల విమర్శ


సమావేశంలో మాట్లాడుతున్న సంగని సూరయ్య, కొమ్ము రమేశ్

నెక్కొండ, మే 28: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో మండలంలో ఏ ఒక్క పనికైనా జీవోలు తేలేదని, బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులకే ఎమ్మెల్యే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, సీనియర్ నాయకుడు, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్ విమర్శించారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలంటూ హడావుడి చేస్తూ ప్రజలను మభ్యపెడుతూ జిమ్మిక్కులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అలంకానిపేట నుంచి చిన్నకొర్పోలు వరకు 4.67 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 3.85 కోట్లు, చిన్నకొర్పోలు-పెద్దకొర్పోలు రోడ్డుపై వట్టివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 13.90 కోట్లు, వట్టివాగుపై పెద్దకొర్పోలు-చిన్నకొర్పోలు మధ్య చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ. 18.60 కోట్ల నిధులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మంజూరు చేయించారని గుర్తుచేశారు. 18 నెలలుగా పనులను ప్రారంభించకుండా, కమీషన్ల కోసం కాంట్రాక్టర్లను మార్చారని, స్థానిక ఎన్నికల ముంగిట వానకాలంలో పనులు ప్రారంభించడం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గాదె భద్రయ్య, మాజీ సర్పంచ్ మాదాసు రవి, మాజీ ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ కర్ర్వారపు శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ మాజీ రాష్ట్ర డైరెక్టర్ సూరం రాజిరెడ్డి, మండల నాయకులు దాసరి శ్రీనివాస్, బొల్లెబోయిన వీరస్వామి, కారింగుల సురేశ్‌గౌడ్, వెంకన్న, కర్ర బుచ్చిరెడ్డి ,శోభన్ పాల్గొన్నారు.

### జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

నల్లబెల్లి, మే 28: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈ నెల 31న జరిగే తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సభను విజయవంతం చేయాలని టీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్ పిలుపునిచ్చారు. నర్సంపేట క్యాంపు కార్యాలయంలో సభ పోస్టర్‌ను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు నరేందర్, టెంజ్ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందం, టీజేఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వేణు, సాగర్, డివిజన్ అధ్యక్షుడు ఉగ్గిడి శివుడు, కుడికాల సుధాకర్ పాల్గొన్నారు.

### ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెక్కొండ, మే 28: నెక్కొండలోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ బాలికల గురుకులంలో అతిథి అధ్యాపకుల ఖాళీల భర్తీకి ఈ నెల 31లోగా ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీదేవి తెలిపారు. జూనియర్ లెక్చరర్ల విభాగంలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ విభాగాలు, పాఠశాలల విభాగంలో తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, గణితం, బయోసైన్స్, సాంఘికశాస్త్రంలో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. బోధన అనుభవం, ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### చికిత్స పొందుతూ చిన్నారి మృతి

గిర్మాజీపేట, మే 28: నీటిసంపులో పడి చిన్నారి మృతి చెందిన ఘటన బుధవారం నగరంలో చోటుచేసుకుంది. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. పరిహీన్(6) వరంగల్ 24వ డివిజన్‌లోని తన పెద్దమ్మ ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటి సంపులో పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు.

### జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు రూ. 10 వేల విరాళం

గీసుగొండ, మే 28: తెలంగాణ జాతిపిత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు మండలకేంద్రానికి చెందిన తాటికొండ మల్లేశం రూ. 10 వేల విరాళం అందజేశారు. నర్సంపేటలో విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మూర్తి, ప్రభాకర్ పాల్గొన్నారు.

### వేధిస్తున్న ఒకరిపై కేసు నమోదు

సంగెం, మే 28: ప్రేమించాలంటూ వేధిస్తున్న ఒకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ బుధవారం తెలిపారు. మండలకేంద్రానికి చెందిన యువతి అమ్మమ్మ గ్రామమైన ఎల్గూరురంగంపేటలో ఉంటూ చదువుకుంటున్నది. ఇంటి పక్కనే ఉన్న బందెల సాయిరామ్ ఆమెను పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో తనను ప్రేమించాలని, లేకుంటే చంపుతానని అతడు వేధిస్తుండడంతో యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అటవీ జంతువుల వేటగాడిపై చర్యలేవి?

నల్లబెల్లి, మే 28: నాటు బాంబులతో గ్రామంలో హల్‌చల్ చేసిన అటవీ జంతువుల వేటగాడిపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీతండాకు చెందిన బానోత్ వీరన్న కొంతమందితో ముఠాగా ఏర్పడి సొంతంగా నాటు బాంబులు తయారు చేసి కొండాపూర్, గోవిందాపూర్ తదితర ఏజెన్సీ అడవులు, పంట చేలల్లో అమర్చి జంతువులను వేటాడడాన్ని వృత్తిగా మల్చుకున్నాడు. ఈ నెల 25న మద్యం మత్తులో ఉన్న వీరన్న ఇదే గ్రామానికి చెందిన బాదావత్ మైసానాయక్‌పై నాటు బాంబులతో దాడికి యత్నించాడు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై లక్ష్మీతండాకు చెందిన మాలోత్ భీక్యానాయక్‌తోపాటు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీరన్న వల్ల తమకు ప్రాణభయం ఉందని భీక్యానాయక్, బాధితుడు మైసానాయక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై గోవర్ధన్‌ను వివరణ కోరగా.. సీఐ నేతృత్వంలో విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.


ఎంజీఎం ఆవరణలో మొక్క నాటుతున్న ఆయుష్ విభాగం వైద్యాధికారులు

## యోగా దినోత్సవ దశాబ్ది వేడుకలు

వరంగల్ చౌరస్తా/రాయపర్తి/గీసుగొండ, మే 28: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన దశాబ్ది వేడుకల్లో భాగంగా ఎంజీఎం హాస్పిటల్ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం రోగులు, ప్రజలకు అవగాహన, హరితహారం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఎంజీఎం హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ పద్మ ఆధ్వర్యంలో రోగులు, అటెండెంట్లకు యోగా ఉపయోగాలు తెలియజేశారు. అనంతరం ఎంజీఎం జనరల్ మెడిసిన్ విభాగం ఎదుట మొక్కలు నాటారు. రాయపర్తి మండలకేంద్రంలో గవర్నమెంట్ ఆయూష్ డిస్పెన్సరీ-సన్నూరు, రాయపర్తి సారథ్యంలో హరిత్ యోగా ఉత్సవంలో భాగంగా ప్రభుత్వ స్థలాల్లో ఔషధ మొక్కలు నాటారు. గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు.

## ఇళ్ల నిర్మాణంలో ధరల నియంత్రణ కమిటీ కీలకం

వరంగల్, మే 28 : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ధరల నియంత్రణ కమిటీ పాత్ర కీలకమని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ధరల నియంత్రణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయంతోపాటు ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుక, మెటీరియల్‌ను నిర్ణీత ధరకు లబ్ధిదారులకు అందేలా కమిటీ చూడాలన్నారు. గ్రేటర్ పరిధిలోని వర్ధన్నపేట, ఖిలావరంగల్, వరంగల్, గీసుగొండ మండలాలకు సంబంధించిన తాపీమేస్త్రీల సంఘాలు, గృహ నిర్మాణ మెటీరియల్ విక్రయదారుల అసోసియేషన్లతో మాట్లాడి తక్కువ ధరకు లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు.


కమిటీ సభ్యులతో సమీక్షిస్తున్న కమిషనర్

## ముసాయిదా తయారీపై అభిప్రాయ సేకరణ


అభిప్రాయాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

హనుమకొండ, మే 28: నూతన విత్తన చట్టం ముసాయిదా తయారీపై కమిటీ సభ్యులు బుధవారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. హనుమకొండ జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో విత్తన కంపెనీ ప్రతినిధులు, డీలర్లు, హనుమకొండ, వరంగల్ జిల్లాలకు చెందిన రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరించారు. రాష్ట్రంలో ఎక్కువగా అమ్మబడుతున్న ట్రూత్ ఫుల్ లేబుల్ విత్తనాలకు బదులు సర్టిఫైడ్ సీడ్స్‌ను రైతులకు అందుబాటులోనికి తీసుకు రావాల్సి ఉందని తెలిపారు. అలాగే ఆడ, మగ పంటల ఉత్పత్తి, సాగులో రైతులు నష్టపోకుండా ప్రతి సాగును వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అగ్రిమెంటు చేయాలన్నారు. అనంతరం కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. అందరి సూచనలు, సలహాలు కమిటీ పరిగణలోనికి తీసుకొని కఠినంగా విత్తన చట్టం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కమిటీ సభ్యుడు సునీల్ కుమార్ (అడ్వకేట్) మాట్లాడుతూ.. మార్కెట్ చట్టంలోని లోపాలను ఆసరాగా చేసుకొని కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తున్నాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, శివప్రసాద్ (డీఏవో సంగారెడ్డి), వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, హనుమకొండ జిల్లా డీఏవో రవీందర్ సింగ్ పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

### మేయర్ గుండు సుధారాణి


పోతననగర్ రోడ్డులో పర్యటిస్తున్న మేయర్

వరంగల్, మే 28: బల్దియా విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం 29వ డివిజన్‌లోని పోతన నగర్, పాత బీటు బజార్, రామన్నపేట, 12 మోరీలు, రఘునాథ్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. పోతనరోడ్డులో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల్లో మట్టి కుప్పలు తొలగించకపోవడంతో కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ డ్రైనేజీల్లో వేయకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించాలన్నారు. నాలా లు, డ్రైనేజీల పూడిక తీత పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, టీపీఎస్‌లు ఇర్షాద్, శ్రీకాంత్, ఏఈ రాగి శ్రీకాంత్, ముజామిల్, హబీబ్, శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, శానిటటీ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ రాజ్ పాల్గొన్నారు.

### వర్షాకాల ప్రణాళికలు అమలు చేయాలి

వర్షాకాలంలో చేపట్టే ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలని మేయర్ సుధారాణి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ ఏడాది భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న తరుణంలో బల్దియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడ ఎలాంటి ఘటనలు జరిగినా బల్దియా అధికారులు స్పందించాలని సూచించారు.

## భారత విద్యార్థులను టార్గెట్ చేస్తున్న ట్రంప్

### ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్


సమావేశంలో మద్దికాయల అశోక్

వరంగల్‌చౌరస్తా, మే 28: విదేశీ విద్యను అభ్యసించడానికి వెళ్లిన విద్యార్థులపై ఆంక్షల పేరుతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత దేశాన్ని తన గుప్పిట్లోకి తీసుకోవడానికి కుట్ర చేస్తున్నాడని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ ధ్వజమెత్తారు. ఓంకార్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ విద్యార్థులపై అమెరికా ఆంక్షలు విధిస్తూ టార్గెట్ చేస్తున్నదని మండిపడ్డారు. ట్రంప్ విధానాలను వ్యతిరేకించాల్సిన మోదీ ప్రభుత్వం మోకాళ్లపై మోకరిల్లి దేశానికి, విదేశాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు, దేశ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మోదీ సర్కార్ ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీల హత్యాకాండను కొనసాగిస్తున్నదన్నారు. రాజకీయాలకతీతంగా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, మద్దతు ధరచట్టం తీసుకురావడంతోపాటు అమలు జరిపేలా చేయడం, నిత్యావసరాల ధరల తగ్గింపు అంశాలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-337056

WANTED

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777135 MULUGU
9182777135 MAHABUBABAD
9182777557 JANGAON
9182777565